# వానలు లేక కాదు-పాలకుల విధానాల ఫలితమే కరవు

**దేశంలోని** అనేక జిల్లాలు ఇపాటికే కరవు కోరల్లో చిక్కుకొని వున్నాయి. నైరుతి రుతు పవనాల కాలంలో సాధారణ వర్షపాతంలో 3/4 వంతు మాత్రమే వర్షాలు కురిశాయి. ఖరీఫ్ వ్యవసాయ సీజన్‌లో దేశవ్యాపితంగా సాధారణ వర్షపాతం కంటే 9 శాతం తక్కువగా వుందని భారత వాతావరణశాఖ అందజేసిన గణాంకాలు తెలుపుతున్నాయి. రాష్ట్రాల వారీగా పరిశీలిస్తే, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్‌లలో 90 శాతంపైగా వర్షపాతం లోటువుంది. కాగా, మహారాష్ట్ర, తెలంగాణా, ఆంధ్రప్రదేశ్‌లలో 2018 డిసెంబర్ మధ్య కాలానికి సాధారణ వర్షపాతంలో 50శాతం లోటు నమోదైంది.

దేశవ్యాపితంగా పంటలు సాగుచేస్తున్న భూవిస్తీర్ణంలో దాదాపు 68శాతం కరవువాత పడింది. దీనిలో 33శాతం ప్రాంతంలో 750 మి.మీ.ల సాంవత్సరిక సగటు వర్షపాతం నమోదుకాగా, ఈ ప్రాంతాన్ని తీవ్రంగా కరవు పొంచివున్న ప్రాంతంగా వర్గీకరించారు. మరో 35 శాతం ప్రాంతంలో 750 నుండి 1125 మి.మీ.ల సాంవత్సరిక సగటు వర్షపాతం కురిసి, కరవు సంభవించే ప్రాంతంగా వర్గీకరించారు.

ఇటీవల భారత వాతావరణశాఖ తన పదకోశం నుండి కరవు అనే పదాన్ని తొలగించింది. "శాస్త్రీయంగా సంక్షిప్తంగా లేవనే పేరుతో ఆ పదాలను ఎత్తివేయటానికో లేదా పునర్ నిర్వచించటానికో" పూనుకుంది. "కరవు సంవత్సరం లేదా తీవ్ర కరవు సంవత్సరం" వంటి పదాలను వాడటానికి బదులుగా, "లోటు సంవత్సరం లేదా తీవ్రలోటు సంవత్సరం" అనే పదాలను భారత వాతావరణశాఖ ఉపయోగిస్తోంది.

2009 సం॥నాటి కరవు నిర్వహణ మాన్యువల్‌ను సవరించి 2016లో ఎన్‌డిఏ ప్రభుత్వం కొత్తగా మాన్యువల్ విడుదల చేసింది. 2016 సం॥ నాటి మాన్యువల్‌లో కరవు పీడిత ప్రాంతంగా గుర్తించటానికి నిర్దేశించిన నిబంధనలను చాలా కఠినతరం చేశారు. దీనితో రాష్ట్రప్రభుత్వాలు కరవు పీడిత ప్రాంతాలుగా ప్రకటించటం కష్టతరమౌతుంది. వర్షపాతం, పంట సాగు ప్రాంతం, భూమిలో తేమ, భూగర్భ -భూఉపరితల నీటి సరఫరా, పంటల ఆరోగ్య పరిరక్షణ ఏర్పాట్లు-అనే ఐదు ప్రమాణాలను కరవు పీడిత ప్రాంతంగా ప్రకటించటానికి నూతన మాన్యువల్‌లో పేర్కొన్నారు. కరవు పీడిత ప్రాంతంగా ప్రకటించాలంటే పై ఐదు అంశాలలో ఏవేని నాలుగు అంశాలు పరిగణలోకి తీసుకోవల్సి వుంటుంది.

దేశంలోని వివిధ తరహాల కరవులను, దేశంలోని ఆరు వాతావరణ మండలాలలోని భిన్నమైన పరిస్థితులను ఈ నూతన మాన్యువల్ పరిగణలోకి తీసుకోలేదు. వాతావరణరీత్యా తక్కువ వర్షపాతం వున్న ప్రాంతాలు, భూగర్భ, భూఉపరితల జలసౌకర్యాలు వేరువేరుగా వున్న ప్రాంతాలు, భూమి తేమలో వివిధ రకాలున్న వ్యవసాయ భూములు అనే విభజనను ఈ నూతన మాన్యువల్ పరిగణలోకి తీసుకోలేదు.

ఇప్పటి ప్రాతిపదికనే కరవు ప్రాంతాలను ప్రకటించేట్లయితే, అనేక కరవు ప్రాంతాలు ప్రకటనకు కూడా నోచుకోవు. కేంద్రప్రభుత్వం కరవు ప్రకటనకు విధించిన ప్రమాణాలలో మార్పుల కారణంగా, ఉత్తరకర్ణాటక ప్రాంతం లోని 13 జిల్లాలలో లోటు వర్షపాతం నమోదై వున్నప్పటికీ దానిని కరవు పీడిత ప్రాంతంగా ప్రకటించటం సాధ్యం కావటంలేదని కర్ణాటక రాష్ట్ర రెవెన్యూ మంత్రి పేర్కొన్నాడు. మహారాష్ట్రలోని మరట్వాడా ప్రాంతాన్ని కరవు పీడిత ప్రాంతంగా ప్రకటించటానికి కేంద్రం విధించిన కఠినమైన నిబంధనలే ఆటంకంగా వున్నాయని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పేర్కొన్నాడు.

కొత్త మాన్యువల్‌ను ప్రకటించి కేంద్రప్రభుత్వం చేతులు దులుపుకుంది. కరవు ఉపశమన చర్యల భారాన్ని రాష్ట్రప్రభుత్వాలపై మోపింది. "జాతీయ విపత్తు ప్రతిస్పందనా నిధి"(ఎన్‌డిఆర్ఎఫ్) క్రింద సహాయాన్ని కోరుతూ విపత్తు తీవ్ర స్వభావం కలిగివుంటేనే కరవు పీడిత ప్రాంతంగా ప్రకటించిన ఓ వారం రోజుల లోపుగా రాష్ట్రాలు ఓ మెమోరాండాన్ని అంద జేయాలని" నూతన మాన్యువల్ స్పష్టం చేసింది.

తీవ్ర కరవుగా ప్రకటించటానికి విధించిన నిబంధనలు ఎంత కఠినతరంగా వున్నాయంటే, ఆ నిబంధనల ప్రకారం ఏ 20 సం॥లకో ఒకసారి మాత్రమే కరవు సంభవించే అవకాశం వుంటుంది. కనుక, రాష్ట్రప్రభుత్వాలు వారికున్న కొద్దిపాటి ఆర్థిక వనరులనుండే నిరంతరం పునరావృతమయ్యే కరవులనెదుర్కోవలసి వుంటుంది; కరవువాతనబడే ప్రజానీకపు అవస్థలు మరెన్నోరెట్లు పెరగనున్నాయి.

1966, 1972, 1979, 1987, 2002, 2014 మరియు 2015 సం॥లు- దేశంలో తీవ్ర కరవు నెలకొన్న కొన్ని సంవత్సరాలు. కాగా, కేంద్రం నూతనంగా ం తీసుకొచ్చిన మాన్యువల్‌లో పేర్కొన్న ప్రాతిపదిక ప్రకారం ఈ తీవ్ర కరవు నెలకొన్న సంవత్సరాలకు అన్వయిస్తే, ఇందులో రెండు సందర్భాలు మినహా మిగిలిన అన్ని సందర్భాలూ కరవు సంవత్సరాలుగా పరిగణింపబడజాలవన్నమాట. ఇదీ, కేంద్ర ప్రభుత్వం కరవు సమస్యను పరిష్కరించదలచిన పద్ధతి!

౦౦౦౦